# మూడో ప్రపంచ కుటుంబం



ఒమ్మి రమేష్‌బాబు

**1**

ఎప్పట్లాగే, ఆ సాయంత్రం పడక్కుర్చీలో కూర్చొంటూ "బాగా చదువుకో నాయనా" అన్నాడు సూరప్పారావు- కొడుకు నుద్దేశించి.

"మంచిగా చదువుకుంటే నువ్వు పెద్ద ఆఫీసరువవు తావురా" అన్నది వసుంధర అన్నం వారుస్తూ.

వ[illegible]ాలో గోడకి జారగిలి కూర్చున్నాడు మహేష్. [illegible]ప్పట్లాగ తండ్రి మాటల్లో ప్రేమ ధ్వనించింది. తల్లి మాటల్లో [illegible]ాత్సల్యం కురిసింది. మహేష్ తన పక్కనే వున్న పుస్తకాల్ని వొడిలోకి తీసుకున్నాడు. ఆ రోజు క్లాసులో చెప్పిన పాఠాల్ని మననం చేసుకుంటూ పేజీల్ని తిరగేస్తున్నాడు.

ఎక్కువసేపు గోడకి నడుంవాల్చి చదువుకోవడం ఇబ్బందిగా వుంది. రోజూలానే కాసేపు కాళ్ళు ముడుచుకొని నిలువుగా కూర్చున్నాడు. మరి కొద్దిసేపు కాళ్ళు బార్లా చాపుకున్నాడు. తర్వాత విలువొంపులా నడుం వొంచి నోట్సు రాసుకున్నాడు. గంటన్నర గడిచేసరికి మహేష్‌కి మెడ నొప్పనిపించింది. కాళ్ళూ చేతులూ నొప్పనిపించాయి.

అసహనంగా ఒకసారి కదిలి చేతిలోని పుస్తకాల్ని పక్కన పెట్టేడు.

చదువుకోవడానికి, రాసుకోవడానికి వీలుగా ఒక టేబులు, కుర్చీ వుంటే బావుండుననిపించింది మహేష్‌కి.

ఎప్పుడో తను చూసిన ఒక దృశ్య లీలగా గుర్తుకొచ్చింది: ఒక వ్యక్తి కుర్చీలో కూర్చొని- టేబుల్‌పైకి విలాసంగా వాలి- దీక్షగా రాసుకుంటున్న సన్నివేశం అది. ఆ దృశ్యాన్ని ఎక్కడ చూశాడో గుర్తులేదు కానీ తన మనసులో ముద్రించుక పో[illegible]ంది.

[illegible] కూడా అలా సౌకర్యవంతంగా కూర్చొని చదువుకొంటున్నట్టు కలగన్నాడు చాలాసార్లు. ఆ కలని మళ్ళీ ఇప్పుడు మననం చేసుకుంటూ తండ్రిని అడిగాడు:

"నాన్నా! నాకొక టేబులు, కుర్చీ కొనిపెట్టవా?" అని.

"పాపం, కింద కూర్చొని చదువుకొందుకు వాడికి కష్టంగా వుందేమోనండీ" అన్నది వసుంధర- కొడుక్కి సరైన సదుపాయం లేకపోయెనే అనే బాధతో.

"ఈ తడవ డబ్బులు అందగానే కొనిపెడతాలే నాయనా" అన్నాడు సూరప్పారావు యథాలాపంగా.

సూరప్పారావు రాజమండ్రిలో మున్సిపల్ కాంట్రాక్టర్ దగ్గర చిరుద్యోగి. చిన్నకుటుంబాన్ని నెట్టుకురాగల చిన్న జీతం. గోదావరి వొడ్డునే ఇరుకుగదుల పెంకుటింటిలో అద్దెకుంటున్నాడు. ఒకడే కొడుకు. ఎనిమిదో తరగతి చదువుతున్న కొడుకంటే సూరప్పారావుకి వల్లమాలిన ప్రేమ. తమ జీవితాలు సరే, కనీసం వాడి భవిష్యత్తయినా బాగు పడాలని ఆయన తపిస్తుంటాడు.

అతిధులొస్తే కూర్చోడానికి ఆ ఇంట్లో ఫ్రేములు విరిగిన రెండు కుర్చీలు, పడక్కుర్చీ మినహా మరేం లేవు. తాతలనాటి నుంచీ వారసత్వంగా వచ్చిన పట్టిమంచం తప్ప మరో మంచం లేదు. అయినా కొడుక్కి టేబులు, కుర్చీ కొనిస్తానని మాటిచ్చాడు సూరప్పారావు. అవి తను ఇప్పటికిప్పుడే కొనివ్వలేడని తెలుసు. ఆ విషయం వసుంధరకీ తెలుసు. నెలనెలా జీతంలోంచి చిల్లరమల్లర అప్పులు పోనూ మిగిలేదేమీ లేదని ఆ ఇద్దరికీ తెలుసు. కానీ, కొడుకు మురిపాన్ని కాదనలేక అలా సముదాయించారు.

అది మొదలు- తండ్రి ఇచ్చిన వరం ఎప్పుడు తీరుతుందా అని ఎదురుచూస్తున్నాడు మహేష్. వీలుచిక్కినప్పుడల్లా ఆ విషయాన్ని తండ్రికి గుర్తుచేస్తూనే వున్నాడు. రానురాను వీధిగదిలో గోడకి జారగిలి చదువుకోవడం మరీ కష్టమనిపిస్తోంది తనకి.

నెలలు గడుస్తున్నా తన ఆశ నెలవేరే సందర్భం మాత్రం తారసపడలేదు.

మహేష్‌కి గతం గుర్తుకొస్తోంది తరచూ-

తనకి క్రికెట్ బ్యాట్ కావాలని అడిగితే 'కొనిస్తానన్నాడు' తండ్రి. కానీ కొనివ్వలేదు. తనకి బాటా జోళ్ళు కావాలని అడిగితే 'కొనిస్తానన్నాడు' తండ్రి. కానీ కొనివ్వలేకపోయాడు.

ఇప్పుడు టేబులు కుర్చీ కూడా ఆ జాబితాలోకి చేరిపోతాయా? ఇదే ప్రశ్న పదేపదే వేదించుతోంది-మహేష్‌ని.

అయితే ఆ ప్రశ్నని ప్రశ్నగానే మిగిలిపోనవ్వలేదు మహేష్. దానికి మరో రూపంలో జవాబు వెతుక్కున్నాడు.

**2**

ఆ ఏడాది సెప్టెంబరులో ఎప్పట్లాగే గోదావరికి వరదలొచ్చాయి. వరదపోటుని చూస్తుంటే మహేష్‌కి మెరుపు లాంటి ఆలోచన వచ్చింది.

వరదల రోజుల్లో తన ఈడు పిల్లలు కలప వేటకి పోయి డబ్బులు సంపాదించుకోవడం మహేష్‌కి తెలుసు. తను కూడా అలానే డబ్బులు కూడబెట్టుకోవచ్చన్న ఆలోచన వచ్చింది. టేబులు కుర్చీ కొనడం ఖరీదైన వ్యవహారం కావొచ్చు. దానికి తన సాయాన్ని జతచేస్తే తండ్రి ఎలా స్పందిస్తాడోనని సందేహం! రెండు రోజులు మనసు ఊగిసలాడినా, చివరికి కలప వేటకి వెళ్ళాలనే మహేష్ నిశ్చయించుకున్నాడు.

మహేష్ గోదావరి వొడ్డునే పుట్టి పెరిగాడు. పసితనాన్నే ఈత నేర్చుకున్నాడు. వంట చెరుకు కోసం వరద గోదావరి నుంచి పుల్లల్ని సేకరించడం షసితనంనుంచీ తనకి అలవాటే! అయితే వరదల్లో మాత్రం ఎప్పుడూ ఈతకి పోలేదు.

గోదావరికి ఎగువన దట్టమైన అరణ్యాలున్నాయి. వరద పొంగినప్పుడల్లా అడవిలోని చెట్టూచేమా కొట్టుకవస్తాయి. ధవళేశ్వరంలో ఆనకట్ట వుండడంవల్ల రాజమండ్రి రేవులు కలప సేకరణకు వీలుగా వుంటాయి. కోటిలింగాల రేవు, పుష్కరఘాట్‌ల మధ్య ఈతగాళ్ళు తెప్పల మీద ఈదుతూ కలపని వొడ్డుకి తెస్తారు. ఒక్కోరోజు చిన్నాచితకా పుల్లలే దొరుకుతాయి. ఒక్కోసారి పెద్దపెద్ద మానులే దక్కుతాయి.

కోటిలింగాల రేవు కలప వ్యాపారానికి నిలయం. అక్కడే కలప అడితీలున్నాయి. సామిల్లులున్నాయి. ఫర్నిచర్ షాపులున్నాయి. వరదల సమయంలో ఆ షాపుల యజమానులు గోదావరి వొడ్డునే కాపుగాస్తుంటారు. ఈతగాళ్ళు వొడ్డుకి తెచ్చే కలపని చౌకబేరాలకి ఎగరేసుకపోతుంటారు.

వరదలు తిగిగేసరికి ఎంతలేదన్నా ఈతగాళ్ళు నాలుగైదొందలు పైబడే సంపాదించుకుంటారు.

**3**

మహేష్ రోజూ గోదావరి వొడ్డునుంచే స్కూలుకి వెళ్ళి వస్తున్నాడు. వరదపోటుని చూడ్డానికి వచ్చే జనాలతో రేవులన్నీ సందడిగా వున్నాయి. పిల్లలు, యువకులు నీటి ప్రవాహాన్ని ఛేదించుకుంటూ పోటాపోటీగా ఈతకు వెళ్తున్నారు. ఆ దృశ్యాన్ని చూస్తుంటే మహేష్‌కి మనసు ఆగలేదు.

మూడోరోజు ఉదయం ఇంటినుంచి స్కూలుకని బయలుదేరిన మహేష్ స్కూలుకి వెళ్ళలేదు. నేరుగా గోదావరి వొడ్డుకి వెళ్ళి మధ్యాహ్నం వరకూ కాలక్షేపం చేశాడు. భోజనానంతరం తన చిన్ననాటి మిత్రుడు రవి ఇంటికి వెళ్ళి తెప్ప కావాలని అడిగాడు. రవి అన్నయ్య ప్రసన్న కూడా గత ఏడాది వరకూ కలప వేటకు వెళ్ళాడు. ఈ ఏడాది క్వారీ కాంట్రాక్టర్ దగ్గర తను పనికి కుదరడంతో దానిని ఎవరూ వాడడం లేదు.

తెప్ప- ఆరడుగుల పొడవు, అడుగున్నర వెడల్పున కళాయిరేకుతో చేసింది. మరీ బరువు లేదు. మహేష్ తన పుస్తకాల సంచీని మిత్రుడి ఇంట్లో వుంచి తెప్పని భుజాన వేసుకుని కోటిలింగాల రేవుకి వచ్చేడు.

మనసులో కాస్తంత దుడుకు, కాస్తంత ఉత్సాహం కలగలిసిన చిత్రమైన అనుభూతి!

రేవులో చుట్టూవున్న జనం తనని స్వాగతిస్తున్నట్టే వుంది. మహేష్ గుండెల నిండా ఊపిరి పీల్చుకుని తెప్పని నీటిలోకి జార్చేడు. దానిమీద వొడుపుగా పడుకుని ప్రవాహానికి ఎదురీదుతూ కోటిలింగాల రేవు వైపు వెళ్ళాడు. వరదకి ఎదురు వెళ్ళడం కష్టంగా వున్నా ఈదుతున్న కొద్దీ ఉత్సాహం రెట్టింపవుతోంది. ఒకడుగు ముందుకి వెళితే, ప్రవాహం రెండడుగులు వెనక్కి తోస్తోంది. అయినా మహేష్ వెను తిరగలేదు. పొద్దువాలే వరకూ ఈదుతూనే వున్నాడు. తొలిరోజున కలప సేకరణ పట్ల ఆసక్తి చూపనేలేదు.

సాయంత్రం కాగానే వొడ్డుకి వచ్చి తెప్పని మిత్రుడి ఇంట్లో పెట్టి, బట్టలు ఆరబెట్టుకున్నాడు. తర్వాత పుస్తకాల సంచీ తీసుకుని ఇంటికి వెళ్ళాడు. తను స్కూలు ఎగ్గొట్టి ఈతకు వెళ్ళినట్టు తెలిస్తే తల్లీతండ్రీ కోప్పడతారని భయం. అందుకే ఆ విషయాన్ని ఎవరికీ చెప్పకుండా తనలోనే దాచుకున్నాడు.

రెండో రోజు కూడా మహేష్ స్కూలుకి వెళ్ళలేదు. మూడో రోజూ వెళ్ళలేదు.

తన తోడి కుర్రాళ్ళతోపాటు కలప వేటకి వెళ్ళాడు. ఎలాగైతేనేం- చిన్నచిన్న పుల్లల్ని వొడ్డుకి లాక్కు రాగలిగేడు. మిగతా వాళ్ళ మాదిరే వాటిని ఒక కలప అడితీ యజమానికి అమ్మి ఇరవై రూపాయలు సంపాదించేడు.

ఇరవై రూపాయలు- అదే తన తొలి సంపాదన. తల్లికీ

